క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో ఆదివారం ఆశ్వీయుజ బహుళ షష్టి సందర్భంగా సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మండల దీక్షను ప్రారంభించినట్లు ఆలయన కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కారెంపూడి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

22న ప్రత్యేక సమావేశం

కారెంపూడి: కారెంపూడి వైఎస్సార్‌సీపీ మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) మేకల శారదపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం ప్రత్యేక సమావేశానికి ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఆదివారం తెలిపారు. గురజాల ఆర్డీవోకు ఎంపీటీసీ సభ్యులు అందించిన అవిశ్వాస తీర్మానం మేరకు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులకు లేఖలు పంపారు. ఆ సర్క్యులర్‌లో 1994 పంచాయతీ చట్టం సెక్షన్ 245లోని సబ్ సెక్షన్ 1 ప్రకారం అవిశ్వాస తీర్మానాన్ని సభ్యులు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అత్యవసర సమావేశానికి సభ్యులంతా తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరుతూ సభ్యులందరికి సర్క్యులర్ జారీ చేశారు.

లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మాచర్ల: పట్టణంలోని ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి(ఏఈఎల్‌సీ)లో రెవ. వై మార్టిన్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు బోధనలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసుక్రీసు మార్గాన్ని అనుసరించాలని, ఎప్పుడూ దేవుని సేవలో ముందుకెళ్తూ ఏసుక్రీస్తు ఆశీస్సులు పొందాలన్నారు. అదే విధంగా చర్చి పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రతి ఒక్కరూ చర్చి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు విడ్ విల్సన్, ఎం.సాంబయ్య, కటికల సురేష్, శేఖర్‌బాబు, ఎక్సమస్ జాన్, జి.పుల్లయ్య, పి.బాబు ఉన్నారు.

నేడు ప్రజల అర్జీల స్వీకరణ

మాచర్ల: పట్టణంలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని తహసీల్దార్ కిరణ్ కుమార్, కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ప్రతి ఒక్కరూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజలు వినతులు అందించాలని కోరారు.

ఘనంగా దేవుని సేవకులను గౌరవించే రోజు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో దేవుని సేవకులను గౌరవించే రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ రెండవ ఆదివారం దేవుని సేవకులను గౌరవించే రోజుగా భావిస్తారు. అందులో భాగంగా సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇశ్రాయిల్ దంపతులను సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సైకిలాబ్, ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి చంద్రకాంత్ కార్యవర్గ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు బంకా కిశోర్‌బాబు, గుజ్జర్లపూడి రవిరాజ్, విశ్వాసులు, దైవ సేవకులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కొమ్మినేని వెంకటేశ్వర్లు

గురజాల: సామాన్యులు, పేదలకు వైద్య విద్య అందకూడదనే దురుద్దేశంతో పాటు తన వారికి వైద్య కళాశాలలను కట్టబెట్టాలనే ఉద్దేశంతో చంద్రబాబు వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సూచనల మేరకు కోటి సంతకాల సేకరణలో భాగంగా ఆదివారం నగర పంచాయతీలోని 12, 13, 19, 20 వార్డుల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి 5 ఏళ్ల పాలనలో 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చి పేద విద్యార్థులను వైద్యులను చేయాలని కలలు కన్నారని, చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క కళాశాల కూడా కట్టలేదన్నారు. 17 వైద్య కళాశాలలను పూర్తి చేసి పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు విద్య అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని, వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున పోరాటం చేయాడానికి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ వార్డు కమిటీల నియామకం చేపట్టారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వి.అమరారెడ్డి, మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, పల్నాడు జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ, కర్రా చినకోటేశ్వరరావు, వేముల చలమయ్య, మహంకాళీ యశోద దుర్గ, దేవండ్ల నారాయణ, అంజిబాబు, సునీల్, రవికుమార్, జక్కా సత్యనారాయణ, కర్రా గిరిబాబు, వినోద్ తదితరులున్నారు.

కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

పిడుగురాళ్ల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణకు పిడుగురాళ్ల పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. ఆదివారం పట్టణంలోని 1, 5, 11, 13, 33 వార్డుల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు ఉచిత వైద్యం అందేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వైద్య కళాశాలలు, వైద్యశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని పలు వార్డుల్లో రచ్చబండ కార్యక్రమంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన కనబడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కందులూరి శివయ్య, షేక్ అబ్దుల్లా, మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ దరియావలి, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుదీర్, బూత్ కన్వీనర్ ఇల్లూరి వెంకయ్య, కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, కొక్కెర శ్రీను, మాజీ కౌన్సిలర్ కుమిత కోటిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కుల అప్పారావు యాదవ్, కొనకండ్ల సాయి, తోట లక్ష్మయ్య, రావులపల్లి చిరంజీవి, మెరుగ సాంబశివరావు, షేక్ యాసిన్, రమేష్, షేక్ జానిపాషా, బసవయ్య, తురక నాగేశ్వరరావు, గుడిపాటి కరుణాకర్, కోటా రమేష్, షేక్ మస్తాన్, షేక్ బాషా, కోటేశ్వరరావు, అబ్రహం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు



పెద అగ్రహారంలో కోటి సంతకాల పోస్టర్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకలు, స్థానికులు

కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన

పిడుగురాళ్లరూరల్: మండలంలోని గ్రామాల నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ప్రజలు స్వచ్ఛందంగా హాజరై సంతకాలను చేస్తున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం తీసుకొని వచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటుందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని ప్రతి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, గురజాల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాంబశివరావు, సర్పంచులు కె.లక్ష్మయ్య, జంగిటి శ్రీను, ఎంపీటీసీ తిమ్మరాజు రామ కోటేశ్వరరావు, నాయకులు ఎం.లక్ష్మారెడ్డి, పిచ్చిరెడ్డి, కాశియ్య, చిన్న, కృష్ణ, దాదినబోయిన కొండలు, ఏసుబాబు, మల్లిఖార్జునరావు, పెద అగ్రహారం నాయకులు సొసైటీ మాజీ అధ్యక్షులు రామకోటేశ్వరరావు, లింగాల వెంకట కోటయ్య, సుధాకర్, బాలకృష్ణ, రామిరెడ్డి, పెద్ద వెంకట్రావయ్య, రామయ్య, మల్లయ్య, రామ్మూర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురం 12వ వార్డులో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ నేతలు



పిడుగురాళ్లలో కోటి సంతకాల సేకరణలో సంతకం చేస్తున్న మహిళలు



చిన అగ్రహారంలో కోటి సంతకాల పోస్టర్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

దాచేపల్లి: కూటమి ప్రభుత్వం అన్నింటా ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తు చేస్తూ కోటి సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. రచ్చబండ కార్యక్రమంలో కూడా ప్రజలు పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత కూటమి ప్రభుత్వంపై ఏడాదిన్నరకే వచ్చిందని అన్నారు. మాజీ సర్పంచ్ మందపాటి రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి నిర్విరామంగా అందిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ దేవల ప్రసన్నలక్ష్మి, దేవళ్ల రఘు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయకుమార్, షేక్ ఖాదర్ బాషా, వార్డు అధ్యక్షుడు కుంచాల నాగరాజు, మక్కల్లా వీర్రాజు, నంద్యాల ఆనంద్, చల్ల లింగయ్య, షేక్ హాజర్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

15న అబ్దుల్ కలాం జయంతి

మాచర్ల: పట్టణంలో ఈ నెల 15వ తేదీన అబ్దుల్ కలాం సేవా సమితి 10వ వార్షికోత్సవం పురస్కరించుకొని డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని, అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు అబ్దుల్ కలాం సేవా సమితి నిర్వాహకులు షేక్ పాషావలి, గాదె రామకృష్ణారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, పఠాన్ నాగూర్ వలిలు తెలిపారు. ఆదివారం వీపీఎన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వివరాలు తెలుపుతూ 15వ తేదీన అబ్దుల్ కలాంకు ఘన నివాళి అర్పించటంతో పాటు వివిధ సేవ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రొఫెసర్స్, అధ్యాపకులు, మేధావులతో పాటు వివిధ సంఘ నాయకులు హాజరవుతారని తెలిపారు.

వైభవంగా దత్తాత్రేయుని విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారు నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన ధన మల్లేశ్వర స్వామి (ధన మల్లయ్య) ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ.. అలాగే ఆలయ ప్రాంగణంలో దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఒప్పిచర్ల గ్రామస్తులతో పాటు వేలాదిగా భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. కొండ మీదకు యంత్రాలు పోలేని పరిస్థితిలో భక్తులే స్వయంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేదానుసారం వారం రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ధ్వజస్తంభాన్ని, దత్తాత్రేయుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో నిర్వహించారు.

సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషం

విజయపురిసౌత్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి దేశంలో ఉండే దళితులందరిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని విజయపురిసౌత్ మాల సంఘ అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని అంబేడ్కర్ సెంటర్‌లో బొబ్బిలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన మాల ఆర్గనైజేషన్ రాష్ట్ర సెక్రటరీ పిల్లి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ దాడిని సీరియస్‌గా తీసుకోవాలని, పోలీసు శాఖ సుమోటోగా కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషమని, ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడి అని, న్యాయవ్యవస్థ గౌరవం కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఇలాంటి దాడులపై ప్రజలు ఏకగ్రీవంగా ఖండించాలని, దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు జాన్ ముత్తయ్య, నరసరావుపేట నియోజకవర్గ ప్రెసిడెంట్ త్రికోటేశ్వరరావు, మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు దాసి మల్లికార్జునరావు, పిల్లి రాజబాబు, సీహెచ్ శ్రీనివాసరావు, పత్తి రామచంద్రరావు, నరసింహ మూర్తి, మీసాల వెంకటేశ్వర్లు, బండి నాగేశ్వరరావు, పురాణం శ్రీను, రాఘవ, రామకృష్ణ, కట్టా రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల ఆర్గనైజేషన్ రాష్ట్ర సెక్రటరీ పిల్లి రాజు

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

పిడుగురాళ్ల: ఐడియల్ యూత్ మూవ్‌మెంట్(ఐవైఎం) సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవైఎం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, అంజుమన్ కమిటీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌మేస్త్రీలు మాట్లాడుతూ యువత ప్రస్తుత ఆధునిక యుగంలో అనేక చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని ఐవైఎం బ్లడ్ డోనేషన్ క్యాంప్‌లు నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారని కమిటీ సభ్యులు తెలిపారు. విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా ఉపాధ్యక్షులు హఫీజ్, మోహబూబ్, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్, పట్టణ మీడియా బాధ్యులు అబ్దుల్ లతీఫ్, ఐవైఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్, ఉపాధ్యక్షుడు ఫిరోజ్, సెక్రటరీ గౌస్ పీరా, సయ్యద్ కరిముల్లా, ఎండీ అలీం, షేక్ సిద్దిక్, పట్టణ ఎస్ఐవో బాధ్యులు అబ్దుల్, మౌలాలి, నాగుల్, ఆరీఫ్, అమ్మ ల్యాబ్ మహేష్, మున్నీర్ పాల్గొన్నారు.



రేపు విద్యుత్ లోక్ అదాలత్

మాచర్ల: మాచర్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరూ వారికి సంబంధించిన విషయాలను పరిష్కరించుకునేందుకు పూర్తిస్థాయిలో అవకాశం కల్పిస్తూ అవగాహన సదస్సుతో పాటు అర్జీలు స్వీకరించటం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింగయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మంగళవారం చంద్రవంక బ్రిడ్జి పక్కన గల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఫార్మర్ డిస్ట్రిక్ట్ జడ్జి, చైర్ పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలు, విజయవాడ ఏపీసీపీడీసీఎల్ వారిచే డివిజన్ పరిధిలో అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలు, బిల్లుల సమస్యలుంటే, పరిష్కారానికి లోక్ అదాలత్‌కు రావాలన్నారు. మరిన్ని వివరాలకు మాచర్ల డివిజన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సత్కారం

రెంటచింతల: స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఎంపీపీఎస్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు డీఎస్సీ 2025 ద్వారా రెంటచింతల మండలంలో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు చిరు సత్కారం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం, ఎంఈవోలు జేసుదాసు, వై.శివనాగేశ్వరరావు పాల్గొంటారన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వెల్దుర్తి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దాక్షాయణి అన్నారు. ఆదివారం మండలంలోని దావుపల్లితండాలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండు రోజుల కిందట తండాకు చెందిన డుమావత్ హరియానాయక్ జ్వరంతో బాధపడుతూ గుంటూరు వైద్యశాలలో పరీక్షలు నిర్వహించుకోగా మెలియాయిడోసిస్ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించటంతో తండాలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. హరియానాయక్ కుటుంబ సభ్యుల నుంచి రక్త నమూనాలు తీసుకొని ల్యాబ్‌కు పంపటం జరిగిందన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయటం జరిగిందన్నారు. మెలోయాయిడోసిస్ వ్యాధి అంటువ్యాధి కాదని, తండాలోని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హరియానాయక్‌ను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం పంపటం జరిగిందన్నారు. తండాలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాచర్ల మలేరియా సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వాగ్యానాయక్, హెచ్‌వీ శాంతకుమారి, వైద్య సిబ్బంది స్వామి నాయక్, ప్రియాంకబాయి తదితరులు పాల్గొన్నారు.



దావుపల్లిలో వైద్య క్యాంపును నిర్వహిస్తున్న డాక్టర్ దాక్షాయణి

ఘనంగా సమాచార హక్కు చట్టం వార్షికోత్సవం

పిడుగురాళ్ల: పట్టణంలో సమాచార హక్కు పరిరక్షణ ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.కుమార్ ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కుమార్ మాట్లాడుతూ.. ఈ చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రమని, ఏ ప్రభుత్వ కార్యాలయాల్లో అయినా మనకు కావాల్సిన సమాచారాన్ని ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. భారతీయ బహుజన్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంపత్తి వెంకట్ యాదవ్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా సమాచారం కోరిన ప్రతి వ్యక్తికి సమాచారం ఇవ్వడానికి ప్రతి కార్యాలయంలో ఒక అధికారి ఉంటారని, సమాచారాన్ని కోరితే ఇంటి వద్దకే వస్తుందని తెలిపారు. అంబేడ్కర్ ప్రచార సేవా సమితి అధ్యక్షుడు డేగల అబ్రహ్మాం మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రతి పౌరుడు వినియోగించుకోవచ్చని, సమాచార హక్కు చట్టం నిబంధనలకు లోబడి సమాచారం అడగాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త మందా డ్యానీ, రమా ఇశ్రాయేలు, సాంద్రపాటి నాగేశ్వరరావు, మల్లెల రాజేష్, సీపీఐ కృష్ణ, ఐహెచ్‌ఆర్‌సీ పట్టణ అధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు మందా దానియేలు, మాజీ యార్డు డైరెక్టర్ మందా యోహోషువ, కొమ్ము పుల్లారావు, షేక్ నాగుర్, డేగల మరియదాస్, నీలగిరి రాజు, బంక శివ, యేసుపోగు సలోమాన్, మల్లవరపు రాఘవ, కోట పేరయ్య, బక్క డేవిడ్, మంద అబ్రహం పాల్గొన్నారు.



ర్యాలీ నిరన్వహిస్తున్న నాయకులు

వైద్యశాల ఉన్నా.. అందని వైద్యం

- రెంటచింతల పశు వైద్యశాలలో వైద్యాధికారి లేక ఇబ్బందులు
- వైద్య సహాయకులతో అరకొరగా వైద్య సేవలు
- పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరుతున్న పశు పోషకులు

రెంటచింతల: గ్రామంలో పశు వైద్యశాల ఉంది... కానీ పశువులకు సుస్తి చేస్తే చూసేందుకు అందుబాటులో పశు వైద్యాధికారి ఉండరు... పశు వైద్య సిబ్బందితో కాలం వెల్లబుచ్చుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. ఇది మండల కేంద్రమైన రెంటచింతలలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి. రెంటచింతల పశు వైద్యశాల పరిధిలో రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి, రెంటాల గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలో సుమారు 5,682 గేదెలు, ఆవులు 458, జీవాలు 10 వేల వరకు ఉన్నట్లు గణంకాలు వెల్లడిస్తున్నాయి.

పశు వైద్యశాలలో పరిస్థితి ఇలా...

ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి బషీర్ ఈ ఏడాది జూన్ 12న క్రోసూర్‌కు బదిలీపై వెళ్లగా.. అటెండర్‌గా పనిచేస్తున్న దార్ల వెంకట్రామయ్య 2 నెలల కిందట అకాల మృతి చెందడంతో పూర్తి స్థాయిలో పశు వైద్యం ఇక్కడ అందుబాటులో లేదని పలువురు పశు పోషకులు వాపోతున్నారు.

- మంచికల్లు పశు వైద్యాధికారి నాగార్జునను ఇన్‌చార్జిగా నియమించగా ఆయన బాధ్యతలు చేపట్టి నామమాత్రపు వైద్య సేవలు అందజేస్తున్నారని పశు పోషకులు చెబుతున్నారు. చల్లగుండ్ల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన పశు వైద్య సహాయకురాలు నాగమణి ఒక్కరే ఇక్కడ అరకొర వైద్య సేవలు అందజేస్తుండటంతో వర్షాకాలంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు రావడంతో బహిరంగ మార్కెట్‌లో మందుల కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని పలువురు పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రైవేటు వ్యక్తులు పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ వారు ఇష్టానుసారం పశు పోషకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.
- గేదె కాలువలో పడగా సరియైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో రూ.80 వేల విలువైన గేదెను కేవలం రూ.20 వేలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రెంటచింతలకు చెందిన అమరేష్ వాపోయాడు. మండలంలోని గోలి, మిట్టగుడిపాడు, రెంటాల, రెంటచింతల తదితర గ్రామాల్లో ఇప్పటికి కూడా పశువులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు పశువుల సంఖ్య గణనీయంగా అంతరించిపోయింది. ఈ నాలుగు గ్రామాలలో 10 సంవత్సరాల కిందట రైతుల ఇంట పదుల సంఖ్యలో పాడి గేదెలతో కళకళలాడుతుండేవి. ప్రభుత్వం, అధికారులు స్పందించి పశు వైద్యశాలలో పూర్తి స్థాయిలో పశు వైద్యాధికారిని, సిబ్బందిని నియమించి పశువులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని పశు పోషకులు కోరుతున్నారు.



రెంటచింతలలోని పశు వైద్యశాల

చర్యలు చేపట్టాలి



స్థానిక పశు వైద్యశాలలో రెగ్యులర్ పశు వైద్యాధికారిని, పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసి పశువులకు మెరుగైన వైద్యం అందజేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలి. ఎన్నో ఏళ్లగా మా కుటుంబం పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నాం. మాకు 11 పాడి గేదెలు ఉన్నాయి. 4 నెలలుగా పశు వైద్యాధికారి లేకపోవడంతో పశువులకు వ్యాధులు వస్తే బహిరంగ మార్కెట్‌లో మందులు కొనుగోలు చేస్తున్నాం.

– షేక్ నాసర్‌బీ, పశు పోషకురాలు, రెంటచింతల

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మాచర్ల రూరల్: ఇంటి నుంచి 5 రోజుల క్రితం బయటకు వెళ్లిన బ్రహ్మయ్య తిరిగి రాలేదని అతని భార్య మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఏఎస్ఐ షేక్ రఫీ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య అనే వ్యక్తి కూరగాయలు తెస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఐదు రోజులైనా ఇంటికి రాకపోవటంతో అతని భార్య రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని అతని వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో తెలియపర్చాలన్నారు.



బ్రహ్మయ్య (ఫైల్)

• ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట రామాలయంలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణు ఆధ్వర్యంలో స్వామి వారికి పత్యేక పూజలు, పంచామృతస్నపన, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.